సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 1 । ఆగస్టు । 2024



అమ్మపాలే అమృతం

అమ్మ అనే పదంలోనే ఆప్యాయత, అనురాగం మిళితమై ఉంటాయి. తల్లిపాలే బిడ్డకు తొలి టీకా. నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు జరగనున్నాయి. -8లో



పింఛనుదారులపై పుట్టా ఫిర్యాదు

పుట్టా సుధాకర్ యాదవ్ ఫిర్యాదుతో మైదుకూరు నియోజకవర్గంలోని సుమారు 35,888 మంది పెన్షనర్లు ఆందోళన చెందుతున్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
36.2/26.6

వాతావరణం

జిల్లాలో బుధవారం 26.6 - 36.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

శ్రీశైలం నిండుగా.. ఆనందం మెండుగా!

తొలకరి ముందుగానే పలకరించడంతో జిల్లాలో ఈ సారి వరి సాగు జోరుమీదుంది. నదీ పరీవాహక ప్రాంతాల రైతులు ఇప్పటికే వరి సాగులో నిమగ్నమై ఉన్నారు. మరోవైపు శ్రీశైలం నిండుకుండలా ఉండడంతో కేసీ ఆయకట్టు రైతుల్లోను ఆశలు చిగురిస్తున్నాయి. శ్రీశైలం నీరు.. కేసీ చి'వరి' ఆయకట్టు వరకు చేరితే తీరమంతా పచ్చని చీర చుట్టడం ఖాయం.

- 2న విడుదల కానున్న కేసీ నీరు
- జిల్లాలో 92,937 ఎకరాల్లో కేసీ ఆయకట్టు
- ఊపందుకోనున్న సాగు... ఉత్సాహంలో రైతులు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ
- నదీ పరివాహకం, బోర్ల కింద ఇప్పటికే నారుమడులు సాగు
- కేసీకి నీరు విడుదల కాగానే ప్రారంభం కానున్న వరినాట్లు


వరినాట్ల కోసం పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

కడప అగ్రికల్చర్: ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండలా కళకళలాడుతోంది. ఈ నెల 2న కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా కేసీ కెనాల్ కింద 92,937.01 ఎకరాల ఆయకట్టు ఉంది. రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట విత్తనాలను గత ప్రభుత్వం సీజన్ ఆరంభంలోనే రైతులకు పంపిణీ చేసింది. ఇటీవల కురిసిన వర్షాలతోపాటు బోర్ల కింద, నదీ పరివాహక ప్రాంతాల్లో చాలామంది రైతులు సత్తువ కోసం పచ్చిరొట్ట విత్తనాలను సాగు చేసుకున్నారు. త్వరలో కేసీ కెనాల్‌కు నీరు విడుదల కానుండటంతో నారుమడుల సాగు జోరందుకోనుంది. రైతులు ఇప్పటికే మండల కేంద్రాల నుంచి విత్తన వడ్లు తెచ్చుకునే పనిలో హడావుడిగా ఉన్నారు. మరికొందరు నారుమడుల సాగుకు సంబంధించి చిన్నచిన్న కయ్యలను ఏర్పాటు చేసుకుని అందులో దమ్ము చేసుకుంటున్నారు. నీటి ఆధారం ఉన్న కొందరు రైతులు ఇప్పటికే నారుమడులను సాగు చేసుకున్నారు. నీటి ఆధారం లేని వారు కేసీకి నీరు విడుదల కాగానే నారుమడులను సిద్ధం చేసుకుంటారు. ముందుగా నారుమడులు సిద్ధం చేసుకున్న రైతన్నలు కేసీ కాలువకు నీరు రాగానే వరినాట్లను ప్రారంభించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ సారి ఖరీఫ్ సీజన్‌లో 77927.5 ఎకరాల్లో సాధారణ వరిసాగు లక్ష్యంగా అధికారులు నిర్దేశించారు.


సత్తువ పంటలుగా జనుము, జీలుగల సాగు..

నీటి ఆధారం ఉన్న రైతులు వరిసాగుకు ముందుగా భూమికి సత్తువ కోసం జీలుగలు, జనుములను చల్లుకుని దమ్ముకు సిద్ధం చేసుకుంటున్నారు. నారుమడి సిద్ధమై వరినాటు వేసేందుకు నెల రోజులకు పైగా గడువు ఉంటుంది. ఈ గడువులో జీలుగలు, జనుము బాగా పెరిగి రైతులకు సత్తువగా పనికొస్తుంది. నీటి ఆధారం లేని రైతులు ఇటీవల కురిసిన వర్షాలకు సాగు చేసుకున్నారు. మరికొంతమంది రైతులు కేసీకి నీరు రాగానే జీలుగలు, జనుము సాగు చేస్తారు. వీరు నారుమడులు సాగు చేసి అది సాగుకు సిద్ధమయ్యే సమయానికి ఈ జీలుగ, జనుము పంట కూడా దమ్ముకు సిద్ధమవుతుంది.

కేసీ కెనాల్ కింద సాగులో ఉన్న ఆయకట్టు వివరాలు ఇలా...

మండలం	ఆయకట్టు (ఎకరాల్లో)
దువ్వూరు	10,419.28
చాపాడు	20,894.48
మైదుకూరు	3,553.23
ఖాజీపేట	20,804.82
రాజుపాలెం	6,894.24
ప్రొద్దుటూరు	5,427.50
కడప	5,371.83
చెన్నూరు	8,200.34
వల్లూరు	406.88
సీకేదిన్నె	121.12
పెద్దముడియం	9,063.0
చాగలమర్రి	643.29

ఇప్పటికే జిల్లాలో 8147.5 ఎకరాల్లో వరిసాగు..



ఇప్పటికే జిల్లాలో బోర్లు ఆధారంగా ఉన్న రైతులు 8147.5 ఎకరాల్లో వరిపంటను సాగు చేశారు. నదీ పరివాహక ప్రాంతాలైన చెన్నూరు, కడప, కమలాపురం, సిద్దవటం, వల్లూరు ప్రాంతాల్లో అత్యధికంగా వరి పంట సాగైంది. ఇందులో భాగంగా కొండాపురంలో 70 హెక్టార్లు, పోరుమామిళ్లలో 77.6, బి.మఠంలో 85, ప్రొద్దుటూరులో 215, జమ్మలమడుగులో 115, ఎర్రగుంట్ల 116, కమలాపురం 142, వల్లూరు 307, చెన్నూరు 315, ఒంటిమిట్ట 89.2, సిద్దవటం 380, కడప 50, పెండ్లిమర్రి 548, వేంపల్లి 140, చక్రాయపేట 447 హెక్టార్ల విస్తీర్ణంలో వరిపంట సాగైంది.

జాగ్రత్తలు పాటించాలి



నారుమడులు సాగు చేసుకునే రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఇందులో నిర్లక్ష్యం చేస్తే సాగు తరువాత పంటలకు చీడపీడలు ఆశించి రైతులు నష్టపోయే ప్రమాదం ఉంటుంది. ముందుగా కొన్ని జాగ్రత్తలు పాటిస్తే సాగు తరువాత ఇబ్బందులు ఉండవు. – డాక్టర్ వీరయ్య, కో ఆర్డినేటర్, ఊటుకూరు కేవీకే, వైఎస్సార్ జిల్లా

పంద్రాగస్టు వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ శివశంకర్


మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: పంద్రాగస్టు వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య దిన వేడుకల నిర్వహణకు చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, ఏఎస్పీ సుధాకర్‌లతో కలసి అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల్లో జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను, వేదికను అందంగా అలంకరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర సమర యోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలని ఆదేశించారు. కార్యక్రమానికి హాజరైన వారికి తాగునీటి సరఫరా, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని కడప ఇంచార్జ్ మునిసిపల్ కమిషనర్ రాకేష్‌కు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించి జిల్లాలో సాధించిన ప్రగతిని చాటిచెప్పేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని డీఆర్డీఏ, డ్వామా, హార్టికల్చర్, ఏపీఎంఐపీ, వ్యవసాయం, ఎస్సీ కార్పొరేషన్ తదితర శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉదయం పెరేడ్ మైదానంలో, సాంస్కృతిక కార్య క్రమాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను కన్నుల పండువగా సాగేలా సంసిద్ధం చేయాలని డీఈఓను ఆదేశించారు. ఆయా శాఖల్లో విశిష్ట సేవలు అందించిన ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయడానికి సంబంధిత ప్రతిపాదిత జాబితాను గడువులోపు అందించాలని ఆదేశించారు. ఇంచార్జి ఆర్డీవో వెంకటపతి సీపీవో వెంకటరావు, జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, డీఎంహెచ్ఓ నాగరాజు, జేడీ నాగేశ్వరరావు, డీటీసీ మీరా ప్రసాద్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేపు కేసీ కాలువకు నీరు విడుదల


కేసీ ప్రధాన కాలువ

మైదుకూరు: కేసీ కాలువకు ఈనెల 2న నీటిని విడుదల చేయనున్నట్లు కేసీ కాలువ డీఈఈ బ్రహ్మారెడ్డి తెలిపారు. శ్రీశైలం ఎగువన సమృద్ధిగా వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరుకుంటోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాజోలి ఆనకట్ట వద్ద నుంచి కేసీ కెనాల్ ద్వారా వైఎస్సార్ జిల్లాలోని ఆయకట్టు రైతులకు సాగునీరు అందించనున్నారు. కేసీ కాలువ ద్వారా ఆయకట్టు రైతులకు ఖరీఫ్ పంటలకు గ్యారెంటీగా సాగునీరు అందుతుందని డీఈఈ బ్రహ్మారెడ్డి తెలిపారు. రాజోలి ఆనకట్ట వద్ద 80 శాతం పూడికను తీయడతో నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు ఉండవని డీఈ స్పష్టం చేశారు.

నేడు ఒంటిమిట్ట రామాలయం మరమ్మతులపై సమీక్ష

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయం గర్భగుడి పై ఉన్న విమాన గోపురానికి త్వరలో మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా గురువారం భారత పురావస్తుశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అలాగే గుడిలోని పలు అభివృద్ధి పనులకు, పనులు జరుగుతున్న సమయంలో భక్తులకు స్వామివారి దర్శనం కల్పించే వెసులుబాటుపై కూడా నిర్ణయం తీసుకోనున్నట్లు వారు తెలిపారు.

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం గుంటూరు వారి ఆదేశాల మేరకు 2024- 25 సంవత్సరానికి సంబంధించి ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కో–ఆర్డినేటర్ చెప్పలి రాజారావు తెలిపారు. పదవ తరగతి పాస్ అయి 15 సంవత్సరాలు నిండిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం కడపలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులలో ఇంగ్లిష్, తెలుగు మీడియం అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యాసకులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. పూర్తి వివరాలకు 91820 99672 సంప్రదించాలని ఆయన సూచించారు.

మెడికల్ అండ్ హెల్త్ ఆర్డీగా శ్రీనివాసులు



కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్–4) ఇన్‌ఛార్జ్ రీజనల్ డైరెక్టర్‌గా డాక్టర్ వై శ్రీనివాసులు నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆర్ఎంఓగా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్డీ రత్నకుమారి బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ స్థానంలో ప్రభుత్వం శ్రీనివాసులును నియమించింది.

నేటి నుంచి ఎస్ఎంసీ ఎన్నికల ప్రక్రియ షురూ

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ పునర్వ్యవస్థీకరణ కోసం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ ఆగస్టు 1వ తేదీ మొదలై 8వ తేదీతో ముగియనుంది. ఇందులో భాగంగా ఆగస్టు 1వ తేదీన ఎస్ఎంసీ సభ్యులు, చైర్మెన్, వైస్ చెర్మెన్ ఎన్నికను నిర్వహించేందుకు ఉదయం 10 గంటలకు నోటిఫికేషన్‌ను విడుదల చేయాలి. అదే రోజు మధ్యాహ్నం నోటీసు బోర్డులో ఎన్నికల నిర్వహణ కోసం ఓటరు జాబితా ప్రదర్శించాలి. 5వ తేదీన ఉదయం 9 నుంచి 1 గంట వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే పరిష్కరించాలి. అదే రోజు సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు ఎన్నికల నిర్వహణ కోసం ఓటరు జాబితాను ఖరారు చేయడంతోపాటు నోటీసు బోర్డులో సంబంధిత జాబితాను ప్రదర్శించాలి. 8వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 1 గంట వరకు ఎన్నికల నిర్వహణ కార్యక్రమాన్ని నిర్వహించాలి. అదే రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు కమిటీ సభ్యులు, స్కూల్ మేనేజ్‌మెంట్ ద్వారా చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నికల నిర్వహించాలి. 2 గంటలకు స్కూల్ చైర్మెన్, వైస్ చైర్మెన్, కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించాలి. సాయంత్రం 3 గంటలకు మొదటి మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించాలి.

సీమ ముద్ద బిడ్డను.. మరిచారా బాబూ.!

- పథకాల పేర్ల మార్పులో రాయలసీమపై వివక్ష!
- కూటమి ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తున్న మేధావులు
- మిగతా పథకాలకైనా 'సీమ'వాసులకు స్థానం కల్పించాలి


బుడ్డా వెంగళరెడ్డి విగ్రహం

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వాలు మారినప్పుడల్లా పథకాలకు పేర్లు మార్చడం సహజం. తమ పార్టీ నాయకులు లేదా నాలుగు ఓట్లు వస్తాయనుకుంటే జాతీయ నాయకుల పేర్లు ప్రభుత్వ పథకాలకు పెట్టడం పరిపాటి. ఇదే కోవలో తాజాగా రాష్ట్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం వివిధ పథకాల పేర్లు మార్చింది. అందులో జగనన్న గోరుముద్ద పథకానికి 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం'అని పేరు మార్చింది. ఆకలితో వచ్చిన వారికి అన్నం పెట్టి ఆదుకున్న డొక్కా సీతమ్మ పేరుపై ఎవరికీ అభ్యంతరం ఉండాల్సిన పని లేదు. ఊళ్లకు ఊళ్లు కరువు బారిన పడి ప్రజలు మృత్యు ముఖంలోకి జారుతున్న విషాద సమయంలో తన ఆస్తుల్ని ధాన్యంగా మార్చి వేలాది పేదల కడుపు నింపి ప్రాణాలు కాపాడిన పూర్వపు కడప జిల్లా ఉయ్యాలవాడ గ్రామ వాసి బుడ్డా వెంగళరెడ్డి పేరు ప్రభుత్వానికి ఎందుకు స్ఫురణకు రాలేదని ఇక్కడి మేధావి వర్గం ప్రశ్నిస్తోంది.

దాతృత్వానికి మరో పేరు వెంగళరెడ్డి

1866లో రాయలసీమను భయంకర కరువు ఒకటి కబళించింది. ప్రజలు దాన్ని ఎర్రగాలి కరువు అని పిలిచేవారు. తినడానికి తిండి లేక, తాగేందుకు గుక్కెడు నీరు సైతం కరువై ప్రజలు డొక్కలు ఎండి అస్థిపంజరాలుగా మారారు. కలరా, మశూచి, బోవెల్ వ్యాధులు విజృంభించి వేల సంఖ్యలో జనం పిట్టల్లా రాలిపోయారు. కడుపు చేతపట్టుకుని వలసలు వెళ్లడంతో గ్రామాలకు గ్రామాలే ఖాళీ అయ్యాయి. ఈ తరుణంలో బుడ్డా వెంగళరెడ్డి దాతృత్వం గురించి ఆ నోటా ఈ నోటా విన్న బళ్లారి, అనంతపురం, కడప జిల్లాల ప్రజలు ఉయ్యాలవాడ గ్రామానికి చేరుకోవడం ప్రారంభించారు. అలా వేల సంఖ్యలో వచ్చిన కరువు బాధితులతో గ్రామం కిటకిటలాడింది. వెంగళరెడ్డి తాము నిల్వ ఉంచిన 12 పాతర్ల ధాన్యం అంటే 1440 బస్తాలు ఖర్చు చేసి పూటకు ఎనిమిది వేల మందికి చొప్పున అన్నం, అంబలి వంటివి అందజేసి ప్రాణాలు నిలిపారు. చివరికి తన భూములు అమ్మి అన్నదాన యజ్ఞాన్ని కొనసాగించారు. అలా మూడు నెలలకు పైగానే ఈ కార్యక్రమం నడిచింది. కరువు వల్ల తమ ఆడబిడ్డలకు పెళ్లిళ్లు చేయలేకపోయారని తెలుసుకున్న వెంగళరెడ్డి తాళిబొట్లు, ముక్కెరలు దానం చేశారు. వర్షాలు కురుస్తున్నాయని తెలియడంతో ప్రజలు తమ గ్రామాలకు బయలుదేరే సమయంలో 15 రోజులపాటు తినడానికి అవసరమైన భత్యం ఆయన అందజేశారు. రైతులకు పశువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు కూడా సమకూర్చారు.

ముఖ్యమంత్రి సీమ వాసి అయినా....


సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాయలసీమ వాసి అయినప్పటికీ ఈ ప్రాంతంలోని మహనీయుల పేర్లను ప్రభుత్వ పథకాలకు పెట్టాలన్న ఆలోచన లేకపోవడం దురదృష్టకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాతృత్వం, త్యాగంలో ఎవరికీ తీసిపోని ఎంతోమంది రాయలసీమలో జన్మించారు. అధికార పార్టీకి చెందిన నాయకులు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి గట్టిగా తీసుకు వెళ్లాలంటున్నారు.

విక్టోరియా మహారాణి పతకం

ఇంగ్లాండ్‌లోని విక్టోరియా మహారాణి వెంగళరెడ్డి దాతృత్వం గురించి తెలిసి ఆశ్చర్యపోయారు. బుడ్డా వెంగళరెడ్డిని మద్రాసుకు ఆహ్వానించి బ్రిటీషు రాజముద్రతో కూడిన విక్టోరియా మహారాణి బంగారు పతకాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఆ పతకం నేటికీ ఉయ్యాలవాడ గ్రామంలోని బుడ్డా వెంగళరెడ్డి వారసుల ఇంట్లో ఉండడం విశేషం.



వెంగళరెడ్డికి విక్టోరియా మహారాణి బహూకరించిన బంగారు పతకం

'సీమ'నేతల వైఖరే కారణం



డొక్కా సీతమ్మ పేరును వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. కోస్తా నాయకులు ఎలాంటి వారైనా ఇలాంటి సందర్భాల్లో రాజకీయాలకు అతీతంగా అందరూ ఒక్కటై ప్రాంతీయ అభిమానాన్ని ప్రదర్శిస్తారు. బుడ్డా వెంగళరెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, సుద్దపల్లె లక్షుమ్మ, చిన్నదండ్లూరు శివమ్మ తదితర గొప్పవాళ్ల గురించి రాయలసీమ నేతలు ఎప్పుడూ, ఎక్కడా మాట్లాడరు. ఎందుకంటే వాళ్ల గొప్పతనాన్ని తెలుసుకుంటే ప్రజలు తమను అసహ్యించుకుంటారనే భయమే ఇందుకు కారణం. ఈ ప్రాంత నాయకుల వైఖరి వల్లే రాయలసీమ వివక్షకు గురవుతోంది. – సీహెచ్ చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షుడు, రాయలసీమ కార్మిక కర్షక సమితి

ఇది ముమ్మాటికీ వివక్షే



కరువులో పేదలను ఆదుకోవడమే కాకుండా అనేక దానధర్మాలతో బుడ్డా వెంగళరెడ్డి మహాదాతగా గుర్తింపు పొందారు. స్వాతంత్ర్య భావనే లేని రోజుల్లో సిపాయిల తిరుగుబాటు కంటే ముందే బ్రిటీషర్లపై గొప్ప పోరాటం చేసి భావి జాతీయోద్యమానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఎంతో ప్రేరణ ఇచ్చారు. ఏదైనా చారిత్రక స్థలానికి ఆయన పేరు పెట్టాలి. తొలి రాజకీయ ఖైదీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కల్లూరి సుబ్బారావు, పప్పూరి రామచార్యులు వంటిఎందరో మహనీయులకు రాయలసీమ జన్మనిచ్చింది. మొట్టమొదటి ఆధునిక కావ్యాన్ని రాసిన కట్టమంచి రామలింగారెడ్డి సీమ వాసి. ఆధునిక సాహిత్య విమర్శకు ఆయన ఆద్యుడు. రాష్ట్ర సాహిత్య అకాడమికి ఆయన పేరు పెట్టడం ఎంతో సముచితం. రాష్ట్ర ప్రభుత్వానికి అమరావతి, అక్కడి అభివృద్ధి తప్ప మరేది పట్టలేదు. కనీసం ప్రభుత్వ పథకాల్లో కూడా సీమ వాసుల పేర్లు పెట్టలేదంటే ఇది ముమ్మాటికీ వివక్షే. – ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, కేంద్ర సాహిత్య అకాదమి పురస్కార గ్రహీత

జిల్లాలో పలువురు డీఎస్పీల బదిలీ

కడప అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సబ్‌డివిజన్‌లు, కేటగిరిలలో పనిచేస్తున్న 96 మంది డీఎస్పీల బదిలీలు, నియామకాలను చేపడుతూ డీజీపీ సిహెచ్ ద్వారకా తిరుమల రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్ఆర్ జిల్లాలో ఆరుగురు డీఎస్పీల బదిలీల, నియామకాలు జరిగాయి. వారి వివరాలిలా ఉన్నాయి.

డీఎస్పీ పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రాంతం
జి. హుసేన్‌పీరా	డీఎస్పీ అప్పా అటాచ్ అటాచ్ పిటీసీ, అనంతపురం	ఎస్‌డీపీఓ, జమ్మలమడుగు
బుక్కే మురళి	డీఎస్పీ ఇంటలిజిజెన్స్ అటాచ్‌డ్ పీటీసీ, తిరుపతి	ఎస్‌డీపీఓ,పులివెందుల
కె.ఎస్ వినోద్‌కుమార్	ఎస్‌డీపీఓ, పులివెందుల	పోలీస్ హెడ్ క్వార్టర్స్
ఎం. భక్తవత్సలం	2వ బెటాలియన్ ఏపీఎస్‌పీ	ఎస్‌డీపీఓ, ప్రొద్దుటూరు
డి. మురళీధర్	ఎస్‌డీపీఓ, ప్రొద్దుటూరు	పోలీస్ హెడ్ క్వార్టర్స్
కె. రవికుమార్	డీపీటీసీ కడప	ఎస్‌డీపీఓ, ఆళ్లగడ్డ

జిల్లాలో సీఐల బదిలీలు



కడప అర్బన్: కర్నూలు రేంజ్ పరిధిలో వైఎస్ఆర్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
బి. రామకృష్ణ	ఎస్‌హెచ్‌ఆర్‌సి,కర్నూలు	కడప ఒన్‌టౌన్ పీఎస్
సి. భాస్కర్ రెడ్డి	కడప ఒన్‌టౌన్ పీఎస్	వీఆర్, ఎస్‌పీ కడప
ఎస్. తేజమూర్తి	ఆదోని ఒన్‌టౌన్ పిఎస్	చిన్నచౌక్ పీఎస్, కడప
పి. నరసింహారెడ్డి	చిన్నచౌక్ పిఎస్, కడప	వి.ఆర్, ఎస్‌పీ, కడప
కె. శ్రీనివాసనాయక్	సిసిఎస్ ,కడప	ఆలూరుపిఎస్, కర్నూలు
పి. రామాంజులు	ఖాజీపేట పీఎస్	మంత్రాలయం సర్కిల్
జె. శివశంకర్	వి.ఆర్, కడప	మైదుకూరు రూరల్
ఎం. శ్రీనాథ్‌రెడ్డి	మైదుకూరు రూరల్	వి.ఆర్, ఎస్‌పీ కడప
పి. నరేష్‌బాబు	వి.ఆర్ అన్నమయ్య	ఎర్రగుంట్ల, పిఎస్
ఆర్. ఈశ్వరయ్య	ఎర్రగుంట్ల, పీఎస్	వి.ఆర్, ఎస్‌పీ కడప

క్లుప్తంగా

మట్టి తరలింపుపై లోకాయుక్తకు ఫిర్యాదు

మైదుకూరు : మైదుకూరు నియోజకవర్గంలో మట్టి, ఇసుక, కంకర అక్రమ తరలింపుపై లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు బీజేపీ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బీపీ.ప్రతాప్ రెడ్డి తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాయల్టీ కట్టకుండా మైదుకూరు, బ్రహ్మంగారిమఠం, ఖాజీపేట మండలాల్లో మట్టి, ఇసుక, సుద్ద మట్టి, కంకర తరలిస్తున్న వైనంపై ఫిర్యాదు చేశానని తెలిపారు. సెప్టెంబర్ 10న వాయిదా ఉంటుందని పేర్కొన్నారు. మైదుకూరు, తదితర ప్రాంతాల్లోని చెరువు మట్టి తవ్వినా, రాయల్టీని స్థానిక సంస్థలకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాయల్టీ ఆయా సంస్థలకు జమ అయ్యేంతవరకూ వదిలే ప్రసక్తే లేదన్నారు.

విద్యుత్తు తీగల చోరీ



విద్యుత్తు తీగలు లేని బోరు

కొండాపురం : బోరు, బావుల వద్ద ఏర్పాటుచేసిన కేబుల్ తీగలు మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని పొట్టిపాడు గ్రామంలో రైతులు బుధవారం తోటల వద్దకు వెళ్లి పంటకు నీరు కట్టాలని చూడగా.. మోటారు పనిచేయలేదు. చిత్రావతి నదిలోకి వెళ్లి చూడగా.. బోరు నుంచి స్టార్టర్ వరకు విద్యుత్ కేబుల్ తీగలు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. తీగల చోరీతో తాము ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. పోలీసులు నిఘా పెట్టి దొంగలను పట్టుకోవాలని డిమాండ్ చేశారు.

గోశాలకు ఆవుల తరలింపు



పట్టుబడిన గోవులకు ముక్తి ధామం గోశాలలో మేత వేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు : బద్వేల్ నియోజకవర్గం నుంచి కేరళకు అక్రమంగా తరలిస్తున్న 33 ఆవులు, ఎద్దులను చల్లబసాయపల్లెలోని ముక్తి ధామం గోశాలకు తరలించినట్లు విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మార్వెల్ల మల్లికార్జునరావు తెలిపారు. బీజేపీ కార్యకర్తలు వుట్టి శ్రీనివాసులు, గోసంరక్షణ సమితి సభ్యులు రాజశేఖరరెడ్డి, శివనాగిరెడ్డి, పుల్లారెడ్డి వాటిని పట్టుకున్నారు. పలుమార్లు ఆవులను పట్టుకుని అడ్డుకుంటున్నా.. అక్రమంగా తరలిస్తూనే ఉన్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేత

అట్లూరు : అట్లూరు మండలం సోమశిల ముంపు ప్రాంతంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద జిల్లా టాస్క్‌ఫోర్స్ (ప్రత్యేక దళం) పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకుని.. అతని వద్ద భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఖాజీపేటకు చెందిన ఓ వ్యక్తి మండలంలోని సోమశిల మునక ప్రాంతమైన రాఘవరెడ్డిపేట సమీపంలో ఆంజనేయ స్వామి గుడి వద్ద ఉంటూ ఏజెన్సీ ఏరియా నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న కడప టాస్క్‌ఫోర్స్ అధికారులు అతడిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.

అమ్మపాలే అమృతం



అమ్మ అనే పదంలోనే ఆప్యాయత, అనురాగం మిళితమై ఉంటాయి. తల్లిపాలే బిడ్డకు తొలి టీకా. నవజాత శిశువుకు బలం చేకూరాలన్నా.. ముర్రుపాలు పట్టాల్సిందే. చాలా మంది ముర్రుపాలు పట్టేందుకు అయిష్టత చూపడంతో చిన్నారులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం తల్లిపాల వారోత్సవాల పేరుతో అవగాహన కల్పించేందుకు సమాయత్తమవుతోంది.

నేటి నుంచి 7వతేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా వ్యాప్తంగా 13 ఐసీడీఎస్ ప్రాజెక్టులుండగా.. వాటి పరిధిలో 2212 మెయిన్ అంగన్వాడీ కేంద్రాలు, 177 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలోని గర్భిణులు, వితంతువులకు వంద శాతం పోషక విలువలున్న తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లాలో ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేది వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

తల్లిపాలే ఆహారం

ఆరు నెలలపాటు తల్లిపాలు ఇస్తే బిడ్డకు తేలికంగా జీర్ణమవుతుందని, ఎలాంటి శ్వాసకోశ, అలర్జీ, అస్తమా, చర్మ వ్యాధులు రావని వైద్య నిపుణులు చెబుతున్నారు. రోజులో బిడ్డకు 8–10 సార్లు పాలు ఇవ్వాలని, రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పడితే వాటిలో ప్రొటీన్లు అధికంగా ఉండి బిడ్డకు రోగాలను ఎదుర్కొనే శక్తి పెంచుతాయని చెబుతున్నారు. తల్లిపాలలో ప్రొటీన్లు, ల్యాక్టోపెరిస్, కోలోస్ట్రమ్, కొన్ని కీలకమైన హార్మోన్లు, రోగ నిరోధక బ్యాక్టీరియా ఉండడంతో పిల్లలు ఎక్కువ బలంగా ఉంటారు. బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లీ, బిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుంది. పాలిచ్చే తల్లులకు నెలసరిలో రక్తస్రావం తక్కువగా ఉంటుంది. పాలిచ్చినంత కాలం మళ్లీ గర్భం రాకుండా నిరోధకంగా కూడా పనిచేస్తుంది. రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు రావు.

అవగాహన కల్పిస్తున్నాం



ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు చేపడుతున్నాం. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు తాగించాలి. వారోత్సవాల్లో భాగంగా ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.

– శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, కడప

పింఛను పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు

కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్ : పింఛన్ పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. స్థానిక కలెక్టరేట్ నుంచి ఆగస్టు 1వ తేదీన పింఛన్ల పంపిణీపై జేసీ అదితిసింగ్‌తో కలిసి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్ల పంపిణీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ఆదేశించారు. బయోమెట్రిక్ డివైజ్, యాప్‌లో ఇబ్బందిలేకుండా చూసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధులు పాల్గొనే కార్యక్రమాన్ని తెలుసుకొని వారి సమన్వయంతో కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఈ రోజు రాత్రికి మండల కేంద్రాల్లో ఉండి పర్యవేక్షించాలని సూచించారు. ఆగస్టు ఒకటో తేదీనే వంద శాతం పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది లబ్ధిదారులంతా ఇళ్ల వద్ద అందుబాటులో ఉండేలా ముందుగానే సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, కుడా వీసీ వై.ఓ.నందన్, కేఎంసీ ఇన్‌ఛార్జి కమిషనర్ రాకేష్, డీఆర్‌డీ పీడీ ఆనంద్‌నాయక్, ఎల్‌డీఎం జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

జిల్లా అభివృద్ధికి సహకరించాలి

జిల్లా సమగ్ర అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరులతో ముఖాముఖి నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో లోపాలు తమ దృష్టికి తీసుకు రావాలని కలెక్టర్ అన్నారు. బద్వేల్ డివిజన్‌లో భూ ఆక్రమణలపై ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రత్యేక అధికారిని రప్పించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. ప్రతి శుక్రవారం సాయంత్రం అధికారులను పిలిచి అర్జీదారుల సమక్షంలో సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు.

పింఛనుదారులపై పుట్టా ఫిర్యాదు



ఇక్కడ కనిపిస్తున్న వృద్ధురాలి పేరు శ్రీపతి సరోజమ్మ. ఆమె వయస్సు 78 ఏళ్లు. 30ఏళ్ల క్రింద భర్త చనిపోవడంతో అప్పటి నుంచి పింఛను వస్తోంది. గత ఐదేళ్లు ఎలాంటి ఇబ్బంది లేకుండా పింఛన్ అందింది. ఇపుడు పింఛనుదారులు వెరిఫికేషన్ చేసుకోవాలని చెప్పడంతో గత మూడు రోజులుగా మీ సేవ, ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతోంది. ఏ పేపర్లు తీసుకురావాలో తనకు తెలియదని, సచివాలయం వద్దకు పోతే.. మీ సేవ వద్దకు వెళ్లాలని చెబుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

- అన్నీ పునఃపరిశీలించాలని మండల అధికారులకు ఆదేశాలు
- మండల కార్యాలయం, ఆధార్ కేంద్రాల చుట్టూ వృద్ధుల అవస్థలు

చాపాడు : మైదుకూరు నియోజకవర్గంలోని మైదుకూరు, చాపాడు, దువ్వూరు, ఖాజీపేట, బ్రహ్మంగారిమఠం మండలాల్లో 35,888 మంది పింఛన్లు పొందుతున్నారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పింఛనుదారుల్లో అనర్హులను గుర్తించి తొలగించాలని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు.. డీఆర్‌డీఏ పీడీ అన్ని ప్రాంతాలో పింఛన్ల వెరిఫికేషన్ చేయాలని ఉత్తర్వులు ఎంపీడీవోలకు అందాయి. గత నాలుగైదు రోజులుగా సచివాలయ పరిధిలోని పింఛనుదారులను సచివాలయ సిబ్బంది విచారిస్తున్నారు. ఆగష్టు నెల 1న పింఛన్ అందుకునే లబ్ధిదారులంతా ఆందోళన చెందుతున్నారు.

పరిశీలన కోసం వృద్ధుల ఇక్కట్లు

పింఛన్ తీసుకునే లబ్ధిదారులంతా తమ ధ్రువీకరణ పత్రాలను సచివాలయాల్లో అందివ్వాలని అధికారులు ఆదేశించారు. ఈ క్రమంలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు, చర్మకారులు, చేనేతలు ఇలా అందరూ మళ్లీ అవసరమైన ధ్రువపత్రాలు సచివాలయాల్లో అందజేయాలని సూచించారు. దీంతో నియోజకవర్గ పరిధిలోని పింఛనుదారులంతా ఆగమేఘాలపై ధ్రువపత్రాలు పొందేందుకు ఆధార్, మీ సేవా, సచివాలయాల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. వికలాంగులకు సదరం సర్టిఫికెట్, వితంతువులకు భర్త మరణ ధ్రువీకరణ పత్రం ఉంటాయని, వృద్ధులు ఏ పత్రాలు ఇవ్వాలో తెలియక ఆవేదన చెందుతున్నారు. మరోవైపు ఒంటరి మహిళలు, చేనేత, డప్పు కళాకారులు, చర్మకారులు పత్రాల కోసం అవస్థపడుతున్నారు.

ఉద్యోగుల మన్ననలు పొందడం సంతోషంగా ఉంది

కడప రూరల్ : ప్రభుత్వ అధికారిగా కీలకమైన విధులను నిర్వర్తించాను.... అందులో భాగంగా ఉద్యోగుల నుంచి మన్ననలు పొందడం ఆత్మ సంతృప్తినిచ్చిందని వైద్య ఆరోగ్య శాఖ (జోన్–4) రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి అన్నారు. పదవీ విరమణ సందర్భంగా ఆ శాఖ ఉద్యోగులు స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో బుధవారం ఘనంగా సన్మానించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ రత్నకుమారి సేవలు ఉద్యోగులకు ఆదర్శవంతంగా నిలుస్తాయన్నారు. డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ జిల్లా ప్రజలు, ఉద్యోగులు మంచి మనసున్నవారన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, డాక్టర్ ప్రభాకర్, వెంకటసుబ్బమ్మ, అతావుల్లా, బత్తనయ్య, వినీష, అధికారులు పాల్గొన్నారు.



డాక్టర్ రత్నకుమారిని సన్మానిస్తున్న ఉద్యోగులు

న్యాయ సంహిత చట్టాలపై అవగాహన అవసరం

ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

బద్వేలు అర్బన్/పోరుమామిళ్ల /ఖాజీపేట : కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న న్యాయ సంహిత చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పోలీసులు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సూచించారు. బుధవారం బద్వేల్ అర్బన్ స్టేషన్, రూరల్ సీఐ కార్యాలయం, రూరల్ పోలీస్ స్టేషన్, పోరుమామిళ్ల, ఖాజీపేట స్టేషన్లను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను చూసిన అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకోవాలని కోరారు. క్రికెట్ బెట్టింగ్, మట్కా, గ్యాంబ్లింగ్ కార్యకలాపాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాల కట్టడికి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. మైదుకూరు డీఎస్పీ టి.వెంకటేశులు, అర్బన్ సీఐ యుగంధర్, రూరల్ ఎస్‌ఐ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



రూరల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

పొలంలో వ్యక్తి దారుణ హత్య



రామచంద్ర(ఫైల్)

కలకడ : పొలంలో ఓ వ్యక్తిని దారుణంగా నరికి చంపిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. డీఎస్పీ రామచంద్రరావు వివరాల మేరకు... కలకడ మండలం, కదిరాయచెర్వు గ్రామానికి చెందిన ఉసిరికాయల రామచంద్ర(45) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కిలోమీటరు దూరంలోని వడ్డిపల్లె సమీపంలో సాగు చేసిన టమాట పంటను చూసుకునేందుకు కుమారుడు వినోద్ కుమార్(7)తో కలిసి మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంలో వెళ్లారు. బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు రామచంద్రను అతి కిరాతకంగా కొట్టి, నరికి చంపారు. భయపడిన రామచంద్ర కుమారుడు వినోద్‌కుమార్, పక్క పొలంలో ఉన్న రైతు చలపతి రామచంద్ర బంధువులు, పోలీసులకు విషయం తెలిపారు. డీఎస్పీ రామచంద్రరావు, సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐలు రామక్రిష్ణారెడ్డి(కలకడ), రహంతుల్లా(కెవిపల్లె) మృత దేశాన్ని పరిశీలించారు. రక్తపు మరకల ఆధారంగా నిందితులను గుర్తించడానికి డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. మృతుడు రామచంద్రకు భార్య లలిత, కుమారుడు వినోద్‌కుమార్, కుమార్తె లక్ష్మి ఉన్నారు. లలిత ఫిర్యాదు చేయడంతో హత్యకు గల కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించినట్లు డీఎస్పీ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఏలూరు వాసి మృతి

వాల్మీకిపురం : విద్యుత్ షాక్‌కు గురై ఏలూరుకు చెందిన ఓ వ్యక్తి వాల్మీకిపురంలో మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు.. ఏలూరు జిల్లా పెదవేగి మండలం చక్రయగూడెం గ్రామానికి చెందిన పదిలం శీను(41) వ్యాపార నిమిత్తం ఏలూరు నుంచి డ్రైవర్ రెడ్డెప్పతోపాటు ఐచర్ లారీలో తమిళనాడులోని దారాపూర్‌కు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి టెంకాయలు నింపుకొని హైదరాబాద్‌కు వస్తున్నారు. మార్గ మధ్యంలో డ్రైవర్ రెడ్డెప్ప వాల్మీకిపురంలోని తన ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి బైపాస్ రోడ్డులో ఓ పక్కగా లారీ నిలిపాడు. బుధవారం ఉదయం ఆ లారీ స్థానిక నివాసాలకు అడ్డుగా ఉందని చెప్పారు. డ్రైవర్ రెడ్డప్ప లేకపోవడంతో పదిలం శీను నెమ్మదిగా ముందుకు తీసుకెళ్లి నిలిపాడు. అయితే లారీపై ఉన్న విద్యుత్తు తీగలను గమనించకపోవడంతో ఒక్క సారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతిచెందాడు. సీఐ పులిశేఖర్, ఎస్‌ఐ నాగేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంపై ఆరా తీశారు. విద్యుత్తు తీగలు వేలాడి ఉండడమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. లారీ డ్రైవర్ రెడ్డెప్పను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఏఈ జాకీర్‌హుస్సేన్ వెళ్లి విద్యుత్తు తీగలు పునరుద్ధరించారు.



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పదిలం శీను

రోడ్డు ప్రమాదంలో షార్ ఉద్యోగి మృతి

చిట్వేలి : చిట్వేలి మండలం వెంకట్రాజుపల్లికి చెందిన షార్ ఉద్యోగి మలిశెట్టి నరేంద్ర(39) బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వెంకట్రాజుపల్లికి చెందిన మలిశెట్టి మాధవయ్య, శంకరమ్మ దంపతుల రెండో కుమారుడైన నరేంద్ర షార్‌లో కంప్యూటర్ విభాగంలో ఉద్యోగం చేస్తున్నాడు. సహ ఉద్యోగి పదవీ విరమణ చేస్తున్నందున గిఫ్ట్ కోసం సూళ్లూరుపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా పిండిపాలెం క్రాస్ వద్ద మంగళవారం మధ్యాహ్నం లారీని ఢీకొన్నారు. ఈ సంఘటనలో నరేంద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి వద్ద ఆధార్ కార్డు ఆధారంగా గుర్తించి ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య అశ్విని, కుమారుడు మౌర్య ఉన్నారు.

కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

షార్ ఉద్యోగి నరేంద్ర పార్థివ దేహాన్ని బుధవారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతి తెలియజేశారు.

లారీ నడిపిన వ్యక్తికి

కడప అర్బన్/చింతకొమ్మదిన్నె : మద్యం తాగి లారీ నడిపిన వ్యక్తికి పది రోజుల జైలు శిక్ష, రూ. 3500 జరిమానా విధించినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్ నాయక్ తెలిపారు. వి.విజయ చంద్రన్ జూలై 30న మద్యం తాగి లారీ నడుపుతూ చింతకొమ్మదిన్నె పోలీస్ స్టేషన్ పరిధిలోని వైఎస్సార్ సర్కిల్‌లో పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా నేరం రుజువు కావడంతో జడ్జి శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

తుపాకీతో కాల్పులకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

మదనపల్లె : వ్యక్తిగత కక్షలతో బావమరిదిపై తుపాకీతో కాల్పులకు పాల్పడిన బావను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ప్రసాదరెడ్డి తెలిపారు. తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సీఐ ఎస్.శేఖర్‌తో కలిసి ఆయన కేసు వివరాలు వెల్లడించారు. జూలై 28న రాత్రి మదనపల్లె మండలం వలసపల్లె సమీపంలోని నవోదయకాలనీలో రెడ్డి ప్రవీణ్(25)పై అతడి బంధువు పూల దివాకర్ నాటుతుపాకీతో కాల్పులు జరిపారు. రెడ్డి ప్రవీణ్ స్వగ్రామం తంబళ్లపల్లె కాగా, ఏడాదిన్నరగా తల్లిదండ్రులతో కలిసి పూల దివాకర్ అన్న పురుషోత్తం ఇంట్లో ఉంటున్నాడు. ఆస్తిలో తనకు వాటా ఇవ్వలేదని అన్న పురుషోత్తం, వదిన రెడ్డెమ్మలపై పూల దివాకర్ కోపం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో 28న రాత్రి 10.30 గంటల సమయంలో దివాకర్, అన్నావదినలతో గొడవపడుతుండగా, రెడ్డి ప్రవీణ్, ఆనంద్ సర్దిచెప్పేందుకు వెళ్లారు. ఆగ్రహించిన దివాకర్ నాటు తుపాకీతో రెడ్డి ప్రవీణ్‌పై కాల్పులు జరిపాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఆనంద్‌పై కొడవలితో దాడికి పాల్పడ్డాడు. రెడ్డిప్రవీణ్, ఆనంద్‌లను మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

మదనపల్లె : మానసిక ఒత్తిడితో చదవలేకపోతున్నానని.. తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారం అందించి బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రాత్రి మదనపల్లె మండలం సీటీఎం రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె పంచాయతీ రామిగానిపల్లెకు చెందిన మధుసూదనరెడ్డి చేనేత కార్మికుడిగా పనిచేస్తున్నాడు. భార్య లలితమ్మతో కలిసి బెంగళూరులో నివాసముంటున్నారు. ఆమె కుమారుడు జి.నవీన్‌కుమార్‌రెడ్డి(19) తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల కళాశాలకు వెళ్లిన నవీన్‌కుమార్‌రెడ్డి చదువుల ఒత్తిడిని భరించలేక మానసికంగా కృంగిపోయాడు. మంగళవారం తిరుపతి నుంచి రైలులో బయలుదేరి సీటీఎంకు చేరుకున్నాడు. రాత్రి వరకు స్టేషన్‌లోనే ఉన్నాడు. తాను పడుతున్న ఇబ్బందులను తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా తెలిపి, చనిపోతున్నట్లుగా స్నేహితులకు రాత్రి 8.40 నిమిషాలకు సమాచారం పంపాడు. అనంతరం రైల్వే స్టేషన్ సమీపంలోని అంగళ్లు వద్ద ఓ చింత చెట్టుకు వైరుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు మదనపల్లె పోలీసులకు విషయం తెలపడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. బుధవారం ఉదయం పెద్ద సంఖ్యలో నవీన్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు, స్నేహితులు జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. విద్యార్థి తండ్రి మధుసూదనరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు.



ఆత్మహత్యకు పాల్పడిన బీటెక్ విద్యార్థి నవీన్‌కుమార్‌రెడ్డి

అప్పుల బాధతో రైతు..

ఓబులవారిపల్లె : చెన్నరాజుపోడు గ్రామానికి చెందిన జోగినేని చంగల్ రాయుడు(49) అప్పులు బాధ తాళలేక బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. చంగల్ రాయుడు ఉదయం తన పొలం వద్దకు వెళ్లి గడ్డి మందు తాగాడని, సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో కుమారుడు వెళ్లి చూడగా చెంగల్ రాయుడు మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె కలరు. మృత దేహాన్ని రైల్వే కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ చిన్న పెద్దయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ దుర్మరణం



వెంకటయ్య (ఫైల్)

బద్వేలు అర్బన్ : పట్టణంలోని నెల్లూరు రోడ్డులోని అయ్యప్పస్వామి గుడి సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఫొటోగ్రాఫర్ మృతిచెందాడు. పట్టణంలోని పూలబావి వీధికి చెందిన చాపల్లివెంకటయ్య(45) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈయనకు భార్య కళ్యాణితోపాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా.. నెల్లూరు రోడ్డులోని అయ్యప్ప స్వామి గుడి వద్ద వేగంగా ద్విచక్ర వాహనంలో వచ్చిన ఓ వ్యక్తి వెంకటయ్యను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన వెంకటయ్యను ప్రభుత్వాసుపత్రికి తరలించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. బుధవారం ఉదయం మృతుడి కుమార్తె నవ్యశ్రీ ఫిర్యాదు మేరకు అర్బన్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళకు గాయాలు



గాయాలపాలైన అంజలి

వేముల : వేముల సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంజలికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. కడపకు చెందిన అంజలి తన కుమారుడు మహేష్‌తో కలిసి అనంతపురం జిల్లా ధర్మవరానికి మోటారు సైకిల్‌పై వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని కడపకు వస్తుండగా.. వేముల సమీపంలో మోటారు సైకిల్ అదుపు తప్పి కింద పడ్డారు. తీవ్ర గాయాలైన అంజలిని 108 వాహనంలో పులివెందుల ఆసుపత్రికి తరలించారు.

బొలెరో వాహనం ఢీకొని...

తంబళ్లపల్లె : ద్విచక్ర వాహనాన్ని బోలెరో వాహనం ఢీకొనడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన తంబళ్లపల్లెలో బుధవారం జరిగింది. తంబళ్లపల్లె మండలం ఏటిగడ్డతాండాకు చెందిన లక్ష్మీదేవి(50), తన అల్లుడు నగేష్‌తో కలిసి సొంత పనుల నిమిత్తం తంబళ్లపల్లెకు ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఎదురుగా వచ్చిన బోలెరో వాహనం ఢీకొనడంతో లక్ష్మీదేవి తలకు తీవ్రగాయమైంది. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స చేసిన వైద్యాధికారి వెంకటరామయ్య మదనపల్లె ఆస్పత్రికి పంపారు.

ఘర్షణ కేసులో 29 మందికి రిమాండ్

కొండాపురం : మండలంలోని టి.కోడూరులో కూటమి నాయకుల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. సోమవారం సోలార్ కంపెనీలోని కాంట్రాక్టు పనుల విషయమై ఘర్షణ తలెత్తిన విషయం విదితమే. వారిలో ఎంపీటీసీ ఎల్.రామమునిరెడ్డితో పాటు తొమ్మిది మంది, చింతాకు పవన్‌కుమార్‌రెడ్డితోపాటు 18 మందిపై కేసులు నమోదు చేశారు. ఇందులో 29 మందిని అదుపులోకి తీసుకోగా నిందితులకు జమ్మల మడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.బార్గవి రిమాండ్ విధించినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

మద్యం తాగి నడిపినందుకు జైలు శిక్ష



సుబ్రహ్మణ్యం

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని భగత్ సింగ్ కాలనీకి చెందిన బొజ్జగాని సుబ్రహ్మణ్యం మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడినందుకు నందలూరు న్యాయమూర్తి నందిని 30 రోజులు రిమాండ్ విధించారు. నిందితుడిని రాజంపేట సబ్ జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు.

క్వారీ కార్మికుడు మృతి

మదనపల్లె : క్వారీ కార్మికుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మంగళ వారం రాత్రి మదనపల్లెలో జరిగింది. బీహార్‌కు చెందిన రామ్ భలి(36) ఉపాధి నిమిత్తం మదనపల్లెకు వచ్చి పుంగనూరు మండలంలోని పాలెంపల్లె క్వారీలో పనిచేస్తున్నాడు. మంగళవారం తన బంధువుతో కలిసి మదనపల్లెకు వచ్చి ఇద్దరూ మద్యం తాగారు. అనంతరం రెడ్డెప్పనాయుడు కాలనీ సమీపంలో ఓ మోరీ వద్ద అపస్మారక స్థితిలో పడిపోయాడు. వెంట ఉన్న బంధువు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వెళ్లి పరిశీలించగా, మృతి చెంది పడి ఉండటాన్ని గమనించారు. మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.